సీఎం ఇలాఖలో.. కత్తి కట్టిన కోడి

- పులివెందులలో జోరుగా కోడిపందేలు
- గోదావరి జిల్లాను తలపించే విధంగా ఏర్పాట్లు
- చేతులు మారిన రూ.కోట్లు
- ఆస్తులు కోల్పోయిన పందెం రాయుళ్లు



(కడప - ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ అంటేనే.. మనవారికి అత్యంత ప్రీతిపాత్రమైన పెద్దపండుగ. ఎందుకంటే.. మూడురోజులు ఈ పండుగను నిర్వహిస్తారు. ఇక సంక్రాంతి పండుగ ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలు కోళ్లపందాలకు అడ్డా అని చెబుతారు. అయితే ఇప్పుడు సీన్ మారింది. సీఎం జగన్ మనోడే.. పోలీసోళ్లు మనం జెబితే ఇంటారు.. ఎందుకబ్బీ అంతదూరం పోవడం, ఎక్కడో నిర్వహించే కోళ్లపందాలకు మనమెందుకు సుమోలు, కార్లలో ఎగేసుకుని వెళ్లాల.. అదేదో మనఊళ్లలోనే పెడితే.. అందరూ ఎంజాయ్ జేస్తారు కదా.. అనుకున్నట్లున్నారు కొందరు పులివెందుల వైసీపీ నేతలు. అందుకే సీఎం జగన్ సొంత పులివెందుల నియోజకవర్గంలో కొన్ని చోట్ల విచ్చ లవిడిగా కోడిపందాలు జరపడం.. స్టేట్‌లోనే చర్చనీయాంశంగా మారింది.

సంక్రాంతి పండుగను కడప జిల్లావాసులు పెద్దపండుగగా భావిస్తారు. మూడు రోజులు జరిగే ఈ పండుగకు ఉద్యోగాలు, వ్యాపార రీత్యా పొరుగు రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లిన వారు సొంత ఊర్లకు వస్తుంటారు. అయితే ఈ ఏడాది కరువుతో రైతన్నలు ఖరీఫ్‌లో కుదేలయ్యారు. రబీలో పంటలు సాగు చేసినా అవి చేతికి వచ్చే పరిస్థితి లేదు. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. పల్లెల్లో సంక్రాంతి కళ తప్పినప్పటికీ జూదగాళ్లు మాత్రం ఎంజాయ్ చేశారు. సీఎం సొంత అడ్డా పులివెందుల, వీఎన్‌పల్లె, వేముల, వేంపల్లెతో పాటు పెండ్లిమర్రి, పోరుమామిళ్లలో కూడా కోడిపందేలు జరగడం చర్చనీయాంశంగా మారింది. పులివెందులలో జరిగిన కోడిపందాల్లో కొందరు భారీగా డబ్బులు, ఆస్తి పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది.

పందెం కోళ్లు ఎగిరాయి

కోడిపందాలంటే ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలకు పరిమితమయ్యేవి. అయితే కడప జిల్లాలో కూడా కోడిపందాలు ఆస్వాదించే వారు ఉన్నారు. పందాలు జరిగితే ఆ ప్రాంతాలకు వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లి పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకుంటుంటారు. అయితే జిల్లాలో పెండ్లిమర్రి మండలం తువ్వపల్లె, వేంపల్లెలోని రామిరెడ్డిపల్లె, గిడ్డంగి వారిపల్లె, భూమాయపల్లె, ఎర్రబల్లి, కొత్తపల్లి, వి.కొత్తపల్లె, ఎర్రబల్లె, పోరుమామిళ్ల ఇతర ప్రాంతాల్లో కోడిపందాలు నిర్వహించినట్లు చెబుతారు.

సీఎం అడ్డాలో జోరుగా...

సీఎం అడ్డా పులివెందులకు కొంత దూరంలోని వి.కొత్తపల్లె, ఎర్రబల్లెలో కోడిపందాలను కోస్తాను మరిపించే విధంగా జరిగినట్లు చెబుతారు. పులివెందు లకు చెందిన వైసీపీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు ఇతర కీలక వైసీపీ నేతలు తమ సత్తా, హోదాకు భంగం కలగని విధంగా పందేలు నిర్వహించారంటారు. కాకిడేగ, పింగలి, ఇతర జాతి కోళ్లను తమిళనాడు, కోస్తా ప్రాంతాల్లో తెప్పించుకుని పందాలు జోరుగా నిర్వహించినట్లు తెలుస్తోంది. కోడిపందేలు కాకుండా లోపల బయట, మంగతాయి, పేకాట తదితర జూదాలు నిర్వహించారు. ఈ పందేలకు పులివెందుల నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి వేల సంఖ్యలో కోడిపందెంరాయుళ్లు తరలివచ్చారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో రెండు రోజుల్లో జరిగిన ఈ కోడిపందేలలో కోట్ల రూపాయలు చేతులు మారాయి.

ఆస్తులు పోయాయి

కొత్తపల్లె, ఎర్రబల్లె ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కోడిపందాల బరిలు అన్ని వసతులు ఏర్పాటు చేశారంటారు. కోడిపందాలు నిర్వహించిన వారికి మద్యం, మాంసాహారాన్ని వైసీపీ వర్గాలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ పోటీల్లో పలువురు లక్షాధికారులు కాగా మరికొందరు బికారులైనట్లు సమాచారం. ఎర్రబల్లెలో ఓ వ్యక్తి రూ.10లక్ష లు గెలుచుకున్నట్లు చెబుతారు. అయితే చెన్నారెడ్డిపేట, నగరిగుట్టకు చెందిన కొందరు పులివెందులలో ఉన్న ఇంటి ప్లాట్లను తాకట్టు పెట్టగా, మరికొందరు భూములను కోడి పందాల్లో పోగొట్టుకున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.



పులివెందుల మండలం ఇ.కొత్తపల్లె గ్రామంలో బరిలోకి దిగిన కోళ్లు





పులివెందుల మండలం ఎర్రిపల్లె గ్రామంలో కోడిపందేల శిబిరంలో భారీగా హాజరైన జనం, కోడిపందెంరాయుళ్లు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన మోటారు వెహికల్స్, ఆటోలు

టీడీపీ పిలుస్తోంది రా..కదలిరా.. సభను విజయవంతం చేయండి

- టీడీపీ రాష్ట్ర నాయకుడు సురేష్‌నాయుడు పిలుపు



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు సురేష్‌నాయుడు

ప్రొద్దుటూరు, జనవరి 16: రాష్ట్రంలో వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ 19న కమలాపురంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న తెలుగుదేశం పిలుస్తోంది రా.కదిలిరా.. సభను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్‌నాయుడు పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక అన్నా క్యాంటిన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప పార్లమెంటు స్థాయిలో జరుగుతున్న ఈ సభకు ప్రతి టీడీపీ కార్యకర్త అభిమాని హాజరై విజయవంతం చేయాలని కోరారు. జగన్ ప్రభుత్వం రోజురోజుకు పతనం అవుతుందన్నారు. 36 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మీద ఎస్మా ప్రయోగించడం సిగ్గు చేటన్నారు. చలో కమలాపురం కార్యక్రమం కోసం పోట్లదుర్తి మెయిన్ రోడ్ పెట్రోల్ బంకు వద్ద 40 బస్సులు, 300 కార్లు, 500 మోటారు సైకిళ్లు బయలు దేరుతాయన్నారు. కార్యకర్తలందరికి భోజన సదుపాయం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ ముక్తియార్, రాజుపాళెం మాజీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, విద్యాసంస్థల అధినేత బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ ఖలీల్, చెన్నయ్యలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం

- గాలి పటాలు వదిలేసి నిరసన
- 36వ రోజుకు చేరిన సమ్మె

కడప(నాగరాజుపేట), జనవరి 16: అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం గాలిపటాల్లా గాలికి వదిలేసిందని అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు పరిష్క రించాలని కోరుతూ కలెక్టరు కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె మంగళవారానికి 36వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు గాలిపటాలు గాలిలోకి వదిలి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు మాట్లాడుతూ సంక్రాంతికైనా ప్రభుత్వం తీపి కబురు చెబుతుందని ఆశించినా.. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమన్నారు. సంక్రాంతి పండుగ సంబరాలకు రూ.5 కోట్లు ఖర్చు పెట్టిన జగన్ 36 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం పట్ల మండి పడ్డారు. జగన్ అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు దాటినా అంగన్వాడీల సమస్యల పట్ల స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. రాబోవు ఎన్నికల్లో జగన్‌కు తగిన గుణపాఠం తప్పక చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు ఎంపీ అంజనీదేవి, వినీలా, సావిత్రి తదిత రులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు గాలిపటాలు వదిలి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు





టంగుటూరు గ్రామంలో సోమేశ్వర మదన గోపాలస్వామి పార్వేట ఉత్సవం, గోపల్లెలో స్వామివారికి భక్తితో పూలమాలలు తెస్తున్న దృశ్యం



చెన్నూరు పెన్నాతీరంలో.. పార్వేట ఉత్సవంలో ఉమామహేశ్వరులను దర్శించుకుంటున్న పుత్తా నరసింహారెడ్డి

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

కడప(కల్చరల్)/ రాజుపాళెం, జనవరి 16: తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి పర్వదినాన్ని మూడు రోజులపాటు జిల్లా ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. తెలుగు లోగిళ్లు బంధుమిత్రులు, కొత్త అల్లుళ్లు, చిన్న పిల్లల కేరింతలతో కొత్త శోభను సంతరించుకున్నాయి. సంక్రాంతికు ముందు రోజు వచ్చే భోగి... తదుపరి మకర సంక్రాంతి, కనుమ పండుగను చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మూడు రోజులు పాటు ప్రతీ ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో ఇంటి ప్రాంగణాలు హరివిల్లును తలపించాయి. ఇంటిల్లిపాది కొత్త బట్టలు ధరించి స్నేహితులు, బంధువులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ ఆనందంతో కేరింతలు కొట్టారు. పిల్లలు, పెద్దలు, ఉత్సాహంగా ఆటపాటల్లో సంతోషంగా గడిపారు. మంగళవారం పాడిపశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి కనుమ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం

రాజుపాళెం మండలం వెల్లాల గ్రామంలో సోమవారం పార్వేట ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా చెన్నకేశవస్వామి సమేత శ్రీదేవి, భూదేవి భీమలింగేశ్వర, గంగాదేవి, పార్వతీదేవి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూలమాలలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య డప్పువాయిద్యాలు, చెక్కభజనలతో వెల్లాలలో ప్రారంభమైన పార్వేట గోపల్లె, మల్లెవే ముల, పగిడాల, కూలూరు, దద్దనాల, పర్లపాడు గ్రామాల్లో ఆనందోత్సాహాలతో నిర్వహించారు. అలాగే కనుమ సందర్భంగా మంగళవారం టంగుటూరు గ్రామంలో పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సోమేశ్వర సమేత పార్వతీ మదన గోపాలస్వామిని పూలమాలతో ప్రత్యేక అలంకరణ చేసి డప్పువాయిద్యాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా కాంతార నాటక ప్రదర్శన, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాలు తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. చెన్నూరులో గొబ్బెమ్మ గౌరమ్మల ఊరేగింపు స్థానిక పురవీధుల్లో ఘనంగా నిర్వహించారు. పెన్నాతీరంలో కనుమ పండుగ నాడు పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.



కాంతార వేషధారణ

రబీ పంటలైనా దక్కేనా..?

- జిల్లా వ్యాప్తంగా 86,919 హెక్టార్లలో పంటల సాగు
- వర్షం కురువకపోవడంతో ఎండిపోతున్న పంటలు
- నీరు కట్టేందుకు ఎకరాకు రూ.7వేలు ఖర్చవుతోందని రైతుల ఆవేదన
- ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వినతి



పంటలను కాపాడుకునేందుకు నీటితడి కోసం కిలోమీటర్‌కు పైగా పైపులు వేసిన దృశ్యం

ఎర్రగుంట్ల, జనవరి 16: వర్షం రాకపోవడంతో రబీలో సాగుచేసిన పంటల పరిస్థితి గాలిలో దీపంలా మారింది. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్ ఆశాజనకంగా లేదు. వేసిన పంటలు బాగా దెబ్బతిని అన్నదాతలు నష్టపోయారు. కనీసం రబీ సీజన్‌లోనైనా వర్షాలు బాగా పడి పంటలు పండుతాయనుకున్న రైతుల ఆశలు నిరాశగానే మిగిలాయి. రబీలో అక్టోబరు నుంచి డిసెంబరు 10 వరకు పంటలు సాగుచేస్తారు. అక్టోబరు, నవంబరులో వర్షాల్లేవు. డిసెంబర్‌లో ఏర్పడిన తుఫాన్ వల్ల ఓ మోస్తరు వర్షం కురవడంతో రైతులు డిసెంబర్ మొదటి వారంలో అత్యధికంగా పంటలు సాగుచేశారు. పంటవేసి నెలదాటినా ఇప్పటి వరకు ఒక్క సారికూడా వర్షం రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్, రబీలో జిల్లాలో చాలాచోట్ల సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. దీంతో భూమిలో తేమ శాతం బాగా తగ్గింది. శనగపంటను వేసేందుకు అక్టోబరులోనే పొలంలో ఎరువులు విత్తారు. దాన్ని వదులుకోలేక, వర్షం వస్తుందన్న ఆశతో డిసెంబర్‌లో శనగ సాగుచేశారు.

వేలాది ఎకరాల్లో శనగపంట

రబీకి సంబంధించి జిల్లాలో 86,919 హెక్టార్లలో అన్ని రకాల పంటలు సాగుచేసినట్లు సమాచారం. ఈ పంటలన్ని తీవ్ర వర్షాభావ పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు అధికారులే స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు ఈక్రాప్ కూడా చేశారు. పంటలు చేతికొచ్చేసరికి మరో 50 రోజులు పడుతుంది. అప్పటి వరకు వానల్లేకుంటే పంటలకు తట్టుకునే శక్తి ఉండదు కాబట్టి దిగుబడి వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో బుడ్డశనగ 39,536 హెక్టార్లలో, మినుము 22,996 హెక్టార్లలో, పెసలు 1,453 హెక్టార్లలో, ఉలవలు 488 హెక్టార్లలో, వేరుశనగ 4,175 హెక్టార్లలో, నువ్వులు 4,224 హెక్టార్లలో, వరి 2,133 హెక్టార్లలో, జొన్న 8,672 హెక్టార్లలో, మొక్కజొన్న 1,408 హెక్టార్లలో, పొద్దుతిరుగుడు 352 హెక్టార్లలో, కుసుమ 420 హెక్టార్లలో, పత్తి 134 హెక్టార్లలో కలిపి.. మొత్తంగా 86,919 హెక్టార్లలో అన్ని రకాల పంటలు సాగుచేశారు. అయితే వర్షాధార పంటల పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉందని రైతులతోపాటు అధికారులు కూడా పేర్కొంటున్నారు.

ఎనిమిదేళ్ల క్రితం ఇదే పరిస్థితి..

వ్యవసాయం చాలా కష్టంగా మారింది. సొంత భూమితో పాటు కౌలు భూమిలో కూడా బుడ్డ శనగ సాగుచేశాను. వర్షం లేక పంట ఎండిపోతోంది. అంటుబాటులో ఉండే పొలాలకు ఎకరాకు రూ.7వేలు ఖర్చుచేసి నీటిని కట్టిస్తున్నా. అయినా పంట దిగుబడి పెద్దగా ఉండదు. 8 ఏళ్లక్రితం ఇదే పరిస్థితి వచ్చింది. ఈసారి కూడా అప్పులే మిగులుతాయి. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేపరిస్థితి లేదు. ప్రభుత్వం పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

- జి.వెంకటరెడ్డి, ఎర్రగుంట్ల

ప్రభుత్వం ఆదుకోవాలి..

30ఎకరాలు కౌలుభూమి, 20ఎకరాలు సొంత భూమిలో శనగ సాగుచేశాను. వర్షం వస్తుందన్న ఆశతో అరకొర పదునుతోనే శనగవిత్తనం వేశా. నెలరోజులు అవుతున్నా ఇప్పటి వరకు వర్షం జాడేలేదు. రూ.2,500 ఖర్చుచేసి పాస్పేట్ వేశాను. రూ.3వేలు శనగవిత్తనాలు, రూ.3500 సేద్యాలకు, మందు కొట్టేందుకు రూ.800, కలుపుకు రూ.900, ప్రస్తుతం నీరు కట్టేందుకు ఎకరాకు రూ.7000 ఖర్చు చేస్తున్నాను. రాత్రింబవళ్లు కష్టపడితే రోజుకు 2ఎకరాల కన్నా ఎక్కువ నీరు కట్టలేకపోతున్నాము. ఇప్పటికే భారీగా అప్పులు చేశాం. వర్షం రాకపోవడంతో పంట దక్కేది కష్టంగా మారింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- పాలగిరి శివప్రసాద్‌రెడ్డి, హనుమనగుత్తి

పంటల పరిస్థితి ఆందోళనకరం..

ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల భూమిలో తేమశాతం బాగా తగ్గింది. దీని వల్ల వేసిన పంటలు త్వరగా వాడుమొకం పడుతున్నాయి. అక్టోబరు నుంచి వర్షపాతం భారీ లోటుంది. దానివల్ల కొన్ని చోట్ల సరిగా మొలకెత్తనే లేదు. మొలచిన పంట కూడా ఆరోగ్యకరంగా లేదు. పంటకోతకు రావాలంటే మరో యాభైరోజులు పడుతుంది. అప్పటి వరకు ఎండ వేడిమికి పంట తట్టుకునే పరిస్థితి కనిపించడం లేదు. పంటలన్ని పదునులేక తీవ్ర బెట్ట పరిస్థితుల్లో ఉన్నాయి. పంటల బీమా వర్తించాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకుని, పంటకోత ప్రయోగాలు కూడా చేయించుకోవాలి.

- శ్రీకాంత్‌రెడ్డి, ఏవో, ఎర్రగుంట్ల



ట్రాక్టర్ ఇంజన్‌తో రెండు పైపుల ద్వారా నీటిని తోడుతున్న దృశ్యం



పొలానికి నీరు కడుతున్న రైతు శివప్రసాద్‌రెడ్డి

కోడిపందెం రాయుళ్లు అరెస్టు

రూ.10,850 నగదు స్వాధీనం


కోడిపందెం రాయుళ్లను అరెస్టు చేసిన పోలీసులు

పోరుమామిళ్ల, జనవరి 16: సంక్రాంతి పండుగ సందర్భంగా ఎల్లవపల్లెలో కోడిపందేలు ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి వారి నుంచి కోడి సహా రూ.10,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోరుమామిళ్ల ఇన్‌చార్జ్ ఎస్‌ఐ అమర్‌నాథ రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎల్లవపల్లె సమీపంలో పేకాడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో దాడులు నిర్వహించామన్నారు. కొందరు పరారీ అయ్యారని, 12మంది, కోడి, నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శెట్టిగుంట పంచాయతీలో...


కోళ్లు నిందితులతో పోలీసులు

రైల్వే కోడూరు(రూరల్) జనవరి 16: శెట్టిగుంట పంచాయతీ మామిడి తోటలో సోమవారం కోడి పందెం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 12930 నగదు, ఏడు పందెం కోళ్లు, రెండు చిన్న కత్తులు స్వాధీనం చేసుకున్నారు, మంగళ వారం రెడ్డివారిపల్లి పంచాయతీలో దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 5110 నగదు, ఆరు పందెం కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది షేక్ ఆఖిఫ్, చంద్ర, పుష్పరాజ్ పాల్గొన్నారు.

జౌకుపల్లెలో ఫుట్‌బాల్ టోర్నమెంటు

● డే అండ్ నైట్ ఆడిన క్రీడాకారులు


ఫుట్‌బాల్‌లో ఆడుతున్న క్రీడాకారులు

బ్రహ్మంగారిమఠం, జనవరి 16: జౌకుపల్లెలో లక్ష్య అకాడమి, బసవ ఫుట్‌బాల్ క్లబ్ కడప ఆధ్వర్యంలో జౌకుపల్లె యూత్ సభ్యులు సంక్రాంతి పండుగ సందర్భంగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో డే అండ్ నైట్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ పోటీల్లో కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుండి 16 జట్లు పాల్గొన్నాయి. ఫుట్‌బాల్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ శాప్ డైరెక్టరు డానియల్ ప్రదీప్, చంద్రమోహన్‌రెడ్డి, కడప జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కోచ్ సుధీర్, వైస్‌ప్రెసిడెంట్ థామస్ హాజరయ్యారు. పోటీల్లో ఫ్రెండ్స్ ఫుట్ బాల్ జట్టు కడప మొదటి విజేతగా నిలిచి రూ.30వేలు, బసవ ఫుట్‌బాల్ జట్టు జౌకుపల్లె ద్వితీయయ విజేతగా రూ.15వేలు, మూడోవిజేతగా ఆత్మకూరు ఫుట్‌బాల్ క్లబ్ అనంతపురం వారికి రూ.7500 నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో బసిరెడ్డి దుర్గాప్రసాద్, వశిష్ట విద్యాపీఠ్ స్కూలు కరస్పాండెంట్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులు అందించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నుజ్జు అయిన వ్యక్తి

జమ్మలమడుగు, జనవరి 16: పెద్దపసుపుల రోడ్డులో సోమవారం సాయంత్రం సుమారు 6.30 గంటలకు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో వై.విశ్వనాథరెడ్డి (59) దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల మేరకు వివరాల్లోకెళితే... వై.విశ్వనాథరెడ్డి పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామస్థుడు. జమ్మలమడుగులో శనగల వ్యాపారం, రైతుగా వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం వ్యాపార నిమిత్తం ద్విచక్ర వాహనంలో పట్టణానికి బయల్దేరాడు. పట్టణంలోకి ప్రవేశిస్తుండగా ఏపీ04.యు.బి.1342 సిమెంటు ట్యాంకర్ వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో విశ్వనాథరెడ్డి ప్రధాన రోడ్డుపైనే నుజ్జు నుజ్జు అయ్యాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో =పోలీసు అధికారులు ఘటనా స్థలానికివెళ్లి పరిశీలించాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పోలీసులు ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంస్కృతీ సంప్రదాయాలను మరువరాదు

చాయాచిత్రమాలిక ఆవిష్కరణలో రామకృష్ణ మఠం ఇన్‌చార్జ్


చిత్రమాలికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప (కల్చరల్), జనవరి 16: మన సంస్కృతీ, సంప్రదాయాలను మరువకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రామకృష్ణ మఠం ఇన్‌చార్జ్ స్వామి సన్నివాసానంద పేర్కొన్నారు. జార్జి రూపొందించిన భృగు మహర్షి ఆస్థానం బుగ్గ మల్లేశ్వరస్వామి దేవస్థానం చిత్రమాలికను మంగళవారం చెన్నూరు బస్టాండు వద్ద గల రామకృష్ణమఠంలో ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో సమాజం పట్ల గౌరవం, ఆచారాల పట్ల ఆసక్తి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తి సన్మార్గంలో పయనించి ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని కోరారు. జిల్లా పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి రామాంజులరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పలు ప్రాచీన పర్యాటక స్థలాలున్నాయని, వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సాహితీవేత్త వెల్లాల వెంకటేశ్వరాచారి తదితలరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి ఇద్దరికి గాయాలు

చికిత్స పొందుతూ మరొకరు మృతి

కడప (క్రైం), జనవరి 16: కడప - క్రిష్ణాపురం రైల్వేస్టేషన్ వద్ద కడప - భాకరాపేట రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం రైళ్ల కింద పడి ఇద్దరికి గాయాలైనట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. కడప వైఎస్ఆర్ కాలనీ వాసి జంగం క్రాంతి మంగళవారం రాత్రి ఇంటి నుంచి వచ్చి చౌటుపల్లె క్రాస్ వద్ద గూడ్సు రైలు కింద పడగా తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. భాకరాపేట వద్ద ఓ యువకుడు రైలు కింద పడి తీవ్రగాయాలపాలయ్యాడని చికిత్స నిమత్తం అతన్ని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఆదివారం రాయచోటి రోడ్డులోని రైల్వేగేటు వద్ద రైలు కింద పడి గాయపడిన షేక్ ఖాదర్ (32) తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈమేరకు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


ఏసీసీ బాధితులకు న్యాయం చేస్తాం

గొల్లపల్లిలో ఓళిగలు పంపిణీ చేసిన భూపేశ్‌రెడ్డి


బాధితుల నుంచి వినతిపత్రం తీసుకుంటున్న భూపేశ్‌రెడ్డి

మైలవరం, జనవరి 16: వైసీపీ అధికారంలోకి రాగానే ఏసీసీ పరిశ్రమ నిర్మిస్తామని ఏసీసీ భూ బాధితులకు మాయ మాటలు చెప్పి ఓళిగలు పంపిణీ చేసి ఓట్లు వేయించుకుని గెలిచిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నాలుగున్నరేళ్లు దాటినా పట్టించుకోకుండా ఏసీసీ బాధితులకు మోసం చేశారని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని గొల్లపల్లిలో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఓళిగలు పంపిణీ చేసి అన్యాయం చేశారని చెబుతూ అందుకు నిరసనగా భూపేశ్‌రెడ్డి ఓళిగలను పంపిణీ చేశారు. ఏసీసీ భూ బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1996 నుంచి ఏసీసీ పరిశ్రమ ఏర్పాటు చేయకపోవడంతో గొల్లపల్లి, వద్దిరాల, బెస్తవేముల, చిన్నవెంతుర్ల, బి.జంగాలపల్లి, కల్లుట్ల, రేగడిపల్లి తదితర గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి ఆది నారాయణరెడ్డి టీడీపీ ప్రభుత్వంలో ఏసీసీ బాధితులను అమరావతికి తీసుకెళ్లి అప్పటి సీఎం చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లారని గుర్తుచేశారు. అంతలోనే ఎన్నికలు రావడం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి చేపట్టిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఏసీసీ పరిశ్రమ నిర్మిస్తామని అబద్దాలు చెప్పడం, జిల్లాలో సీఎం జగన్ ఎన్నో సార్లు పర్యటించినా కనీసం ఒక్కసారైనా ఏసీసీ భూ బాధిత రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోకుండా కనీసం వినతి పత్రం కూడా ఇవ్వలేదంటే ఎమ్మెల్యే పరిస్థితి అర్థమవుతుందన్నారు. సీఎం వద్దకు వెళ్లేందుకు ఎమ్మెల్యేకే అపాయిమెంట్ లేక ఇబ్బంది పడుతుంటే ఏసీసీ బాధిత రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏసీసీ బాధితులకు న్యాయం చేస్తామన్నారు. పరిశ్రమలు తేవడంతో చంద్రబాబును మించినవారు లేరని నియోజకవర్గంలో సోలార్, ఏసీసీ పరిశ్రమలు వచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసింహులు, నేతలు కొండయ్య, పాపిరెడ్డి, సూర్యపెద్దిరాజు, గంగరాజు, రాజారెడ్డి, తులసీరెడ్డి, బూసిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముని పార్వేట


పార్వేటి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, జనవరి16: వైభవంగా కోదండరాముని పార్వేట ఉత్సవాన్ని టీటీడీ అర్చకులు, గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి కనుమ రోజున పార్వేట ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ఉత్సవ మూర్తులను రామాలయంలో ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవంగా కోదండరాం సమీప నాగేటి తిప్పపై పార్వేట ఉత్సవాన్ని ప్రారంభించారు. ఉత్సవమూర్తుల మధ్య పెద్దఎత్తున భక్తులు స్వామి వారిని మండపం పైనుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవంగా సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శనమిచ్చారు. వీరికి గ్రామంలో మహిళలు భక్తులు పెద్దఎత్తున కాయాకర్పూరం సమర్పించి స్వామి వారిని దర్శించు కున్నారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి ఉత్సవాలు


బండలాగుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి ఎద్దులు - ప్రత్యేక అలంకరణలో శివుడు, పార్వతీదేవి

చాపాడు, జనవరి 16: వెదురూరు, రాజుపాళెం, నరహరిపురం గ్రామాల్లో 14న ఆదివారం నుంచి మూడు రోజులపాటు సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వెదురూరు సంగమేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న దేవతామూర్తులు అయిన శివుడు, పార్వతీదేవిలకు పలు రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. గణపతి పూజ, కుంకుమార్చన, పాలాభిషేకం, హోమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దైవదర్శనం చేసుకున్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య మంగళవారం దైవదర్శనం చేసుకున్నారు. చెక్కభజన, కోలాటం, పాటకచేరి నిర్వహించారు. మంగళవారం వెదురూరు, నరహరిపురం గ్రామాల్లో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో నంద్యాల జిల్లా డోన్ మండలం వాసి ధర్మవరం సుబ్బారెడ్డి ఎద్దులు 2,562 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.1,00,116 గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వల్లూరు మండలం బాలుగారిపల్లె వాసి ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్దులు 2001 అడుగు లాగి రెండో బహుమతి రూ.70,116, అనంతపురం జిల్లా చెర్లోపల్లె గ్రామానికి చెందిన శివరామిరెడ్డి ఎద్దులు 1766 అడుగులు లాగి మూడో బహుమతి రూ.50,116 గెలుచుకున్నట్లు వారు తెలిపారు. వెదురూరులో నిర్వహించిన పోటీల్లో ప్రొద్దుటూరు టౌన్ వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వార్కల గురివిరెడ్డి ఎద్దులు 2,164 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.1,00,116, నంద్యాల జిల్లా గడివేముల మండలం చక్రవాయిలి వాసి సయ్యద్‌బాష కలాం ఎద్దులు 1603 అడుగులు లాగి రెండో బహుమతి రూ.70,116, మిడుమాను మండలం గుడిపాడు గ్రామానికి చెందిన కొప్పుల తిమ్మారెడ్డి ఎద్దులు 1130 అడుగులు లాగి మూడో బహుమతి రూ.50,116 గెలుచుకున్నాయి.

గుర్తు తెలియని శవం లభ్యం

సికెదిన్నె, జనవరి 16: గుర్తు తెలియని పురుషుడి శవాన్ని కనుగొన్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు కడప - రాయచోటి జాతీయ రహదారిపై బుగ్గలేటిపల్లె సమీప ఏఎల్ కాలనీ వద్ద కంపచెట్లలో దుర్వాసన వస్తుండడంతో స్థానికులు అందించిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లి చూడగా దాదాపు 60 ఏళ్లున్న వ్యక్తి శవాన్ని కనుగొన్నామన్నారు. దాదాపు వారం కిందటే మరణించి ఉండవచ్చని తెలుస్తోంది. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి వీఆర్వో రవిశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

33 మద్యం బాటిళ్లు స్వాధీనం - ఒకరి అరెస్టు

సిద్దవటం, జనవరి16: భాకరాపేట వద్ద అక్రమంగా బత్తల చెంగయ్య నుంచి 33 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పెద్దఓబన్న తెలియజేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ తెల్లవారుజామున ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రైల్వేకోడూరుకు చెందిన బత్తల చంగయ్య వద్ద 24 బీరు సీసాలు, 750 ఎంఎల్ 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : యూటీఎఫ్


అంగన్వాడీలకు మద్దతు తెలుపుతున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 16: ఎండనక, వాననక రోడ్డెక్కి న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలంటూ 35 రోజులుగా సమ్మె బాట పట్టిన అంగన్వాడీల పట్ల ప్రభుత్వం నియంతృత్వ పోకడ ప్రదర్శిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర క్యాదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తీవ్రంగా ఖండించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపిన వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అంగన్వాడీ అక్కా చెల్లెల సమస్యలు అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని తెలంగాణ కంటే వెయ్యి అదనంగా జీతం ఇస్తామని అనేక హామీలను గుప్పించిన సీఎం ఇప్పటికీ ఇచ్చిన హామీలు అమలు చేయమని కోరుతూ సమ్మె బాట పట్టిన వారితో చర్చల పేరుతో కాలయాపన చేస్తూ వారి సమస్యలు పరిష్కరించకపోవడం పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని నిరూపితమైందన్నారు. అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లోని అట్టడుగు ప్రజానీకానికి చేరవేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సేవలు చేస్తున్న వారిని గుర్తించకపోవడం ప్రభుత్వానికి తగదన్నారు. పండుగ రోజు కూడా పస్తులు ఉంటూ సమ్మె కొనసాగిస్తున్న వారి పట్ల ప్రభుత్వానికి కనీసం మానవత్వం లేకుండా పోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. యూటీఎఫ్ నేతలు రవికుమార్, నరసింహారావు, రమణ, ప్రభాకర్, మజ్జారి చెన్నకేశవులు, బత్తుల చంద్రశేఖర్, కిరణ్‌కుమార్, జి.వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

పెన్నాతీరం పార్వేట సంబరం

ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు


పెన్నాతీరంలో పోటెత్తిన ప్రజలు

చెన్నూరు, జనవరి 16: పెన్నాతీరం సంక్రాతి సంబరంలో భాగంగా పార్వేట ఉత్సవంలో భక్తులు పోటెత్తారు. చెన్నూరులో ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సాంప్రదాయానికి అచ్చమైన ముచ్చటైన పండుగ. మూడురోజుల పండుగలో ప్రజలు ఎంతో సంతోషాలతో ఉంటారని ఇలాంటి సంతోషాలు వారి జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఉండాలని దేవున్ని కోరుకుంటుంటారు. ఏటా పార్వేట ఉత్సవం పెన్నాతీరంలో ఎంతో అంగరంగ వైభవంగా జరుగుతుందని ఈఉత్సవానికి తన అత్తగారి ఊరైన చెన్నూరు మండలం నుంచి ఏటా ఆహ్వానం వస్తుందని మామూలుగా తాను ఊరికి వస్తున్నా సంప్రదాయమైన ఈ పండుగకు రావడం తనకు ఎంతో సంతోషం ఇస్తుందని టీడీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. పాతమిత్రులను, టీడీపీ నేతలు, కార్యకర్తలను చిన్నతనంలో తనతో పాటు చదువుకున్న మిత్రులను కలుసుకోవడం తనకు మరింత సంతోషం ఇస్తుందన్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం

కనుమ పండుగ నాడు పెన్నాతీరంలో పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కొండపేటలో మధ్యాహ్నం నుంచి ఉమమహేశ్వర ఉత్సవమూర్తులను ఊరేగించి అనంతరం పెన్నాతీరానిక తీసుకువచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు ప్రకటించుకున్నారు. ఎంతో విశిష్టమైన ఈ పండుగ కొత్త అల్లుళ్లు, కొత్త కోడళ్లు, దూర ప్రాంత బంధువులు అందరూ పెన్నాతీరానికి తరలిరావడంతో కొత్త కళ సంతరించుకుంది. పెన్నాతీరమంతా జనసంద్ర మైంది. చిన్నారుల గాలిపటాలు ఎగురవేత, పెద్దల కబడ్డీ, ఇస్కాన్ వారి భజనలు, రకరకాల ఆటల పోటీలు వయో తేడాలేకుండా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సందడిగా జరిపారు. మండల కన్వీనరు కెవి జయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, మాజీ సర్పంచులు మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముండ్ల శ్రీనివాసులరెడ్డి, చెన్నూరు కార్యదర్శి పాలగిరి సుదర్శన్‌రెడ్డి టీడీపీ నేతలు లేవాకు ప్రతాప్‌రెడ్డి, ఓబిలి విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, తెలుగుయువత జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్లు సీజ్

ఒకరి అరెస్టు - కారు సీజ్

కొండాపురం, జనవరి 16: రెండు వేర్వేరు ప్రాంతాల్లో 12 మద్యం బాటిళ్లను సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేసి, కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గండికోట నుంచి బ్రహ్మసముద్రానికి శివకుమార్ కారులో మద్యం బాటిళ్లను తీసుకెళుతున్నాడు. కొండాపురం మండలం ముచ్చుమర్రి ఆర్చి వద్ద తనిఖీ చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కారు సీజ్ చేశామని కొండాపురం ఎస్‌ఐ యోగీంద్ర తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన విలేకరులకు తెలిపారు.

మద్యం విక్రయిస్తుండగా...

కడప (క్రైం), జనవరి 16: అక్రమంగా మద్యం అమ్ముతున్న చలమారెడ్డిపల్లె వాసి రోహిత్‌ను అదుపులోకి తీసుకుని ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కడప నగర శివార్లలోని రిమ్స్ పీఎస్ పరిధిలో మంగళవారం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సీఐ రామచంద్ర తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు.

అయోధ్యకు ఆహ్వానం


ఆహ్వాన పత్రిక అందిస్తున్న అయోధ్య ప్రతినిధులు

బ్రహ్మంగారిమఠం, జనవరి 16: అయోధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్టకు అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామికి ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి తప్పకుండా రావాలని కోరినట్లు నిర్వాహకులు తెలిపారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి



బ్రహ్మంగారిమఠం, జనవరి 16: సోమిరెడ్డిపల్లె సర్పంచ్ సోమిరెడ్డిపల్లె రామయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆర్మీలో దేశ సేవలో తరించిన రామయ్య ఉద్యోగ విరమణ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి సర్పంచ్‌గా గెలుపొంది ప్రజల ఆదరాభిమానాలు పొందాడు. ప్రజలకందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు తీరుస్తూ అంతో ఇంతో సహాయం అందించేవారు. మంగళవారం ఉదయం అనారోగ్యంతో బెంగుళూరులో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయన మృతితో తోటి స్నేహితులు, సర్పంచులు, అధికారులు, దళిత సంఘాల నేతలు ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు.

దేనేపల్లిలో ఘర్షణ - ఒకరు మృతి


చిన్నబాలయ్య మృతదేహం

ముద్దనూరు జనవరి16: దేనేపల్లిలో సోమవారం జరిగిన ఘర్షణలో కొలిమి చిన్నబాలయ్య (35) మృతి చెందినట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. సీఐ సమాచారం మేరకు వివరాలు... చిన్నబాలయ్య అదే గ్రామానికి చెందిన పుల్లయ్య సాయంత్రం గ్రామ సమీప గుడి వద్ద మద్యం మత్తులో గొడవ పడ్డారు. పుల్లయ్య చిన్నబాలయ్యపై టెంకాయలు వలిచే కడ్డీతో దాడి చేయగా ఛాతిపై గుచ్చుకోవడంతో తీవ్రగాయమైంది. వెంటనే చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. ఈ దాడిలో పుల్లయ్య మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఒంటిమిట్ట, జనవరి16: ఒంటిమిట్టలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక కోదండరామాలయం వెనుక భాగంగా చోటు చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు విచారణ చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తిగా గుర్తించారని, సుమారు 50 ఏళ్ల పైబడి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

మిన్నంటిన సంక్రాంతి సంబరాలు





పులివెందుల శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు... శ్రీలక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం.. వల్లూరు: గ్రామోత్సవంలో శివకేశవులను ఊరేగిస్తున్న భక్తులు

● పట్టణం, గ్రామాలలో మూడు రోజుల పాటు సంబరాలు ● పితృదేవతల పేరిట నూతన వస్త్రాలు, బియ్యం వితరణ

పులివెందుల టౌన్, జనవరి 16: తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి పులివెందుల వాసులు సంబరంగా జరుపుకొన్నారు. వృత్తి విద్య, ఉద్యోగం, వ్యాపారం ఇలా ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారంతా ఈ పండుగకు సొంత ఊర్లకు చేరడంతో పల్లెల్లో, పట్టణాల్లో చుటట్టాలతో ఇళ్ల సందడిగా మారాయి. భోగి మంటలు, హరిదాసులు, గంగిరెద్దుల సన్నాయి మేళం, రంగవల్లులు, గొబ్బమ్మలు కొత్త అల్లుళ్ల ఘుమఘుమలాడే పిండి వంటలు, ఆటలతో మూడు రోజుల పండుగా ముచ్చటగా సాగింది. సోమవారం సంక్రాంతి పండుగ ఘనంగా జరుపుకొన్నా ప్రజలు మంగళవారం కనుమ పండు సందర్భంగా పశుసంపదలను ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. పెద్దలను స్మరించుకొని పూజించారు. కొందరు పితృదేవతల పేరిట నూతన వస్త్రాలు, బియ్యం, తదితర సామాగ్రి ఆలయ గ్రామాలలో పురోహితులకు అందించారు. బందుమిత్రులతో కలిసి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అలాగే పట్టణంలోని శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మూడు రోజుల పాటు శిల్పారామంలో సందర్శకులతో కిటకిటడింది. శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో ముగ్గులపోటీలు, కైట్ ఫెస్టివల్, నృత్య ప్రదర్శనలు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అలాగే పట్టణంలోని వాసవి కాలనీలో మంగళవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆల కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఉత్సవమూర్తి గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పార్వేట ఉత్సవం నిర్వహించారు.

కోలాహలంగా సంక్రాంతి వేడుకలు

వల్లూరు, జనవరి 16: సంక్రాంతి వేడుకలు కోలాహలంగా సాగాయి. సంక్రాంతి, కనుమ పండుగ రోజుల్లో మండల వ్యాప్తంగా పండుగను ఘనంగా జరుపుకున్నారు. కొత్త అల్లుళ్ల సందడి నెలకొంది. అలాగే వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రసిద్ధిగాంచిన పుష్పగిరిలో సంక్రాంతి పండుగ సందర్భంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కామాక్షి సమేత వైద్యనాధేశ్వర రాజ్యలక్ష్మి సమేత స్వామివారి విగ్రహాలు అలంకరించి పంచమ నదీ సంగమం వద్దకు తీసుకువచ్చి పార్వేట ఉత్సవం నిర్వహించారు. పార్వేటలో దేవస్థానం వారు కుందేళ్ల వదలగా వాటిని పట్టుకునేందుకు భక్తులు పరుగులు తీశారు.

ఘనంగా గొబ్బెమ్మల ఊరేగింపు

చెన్నూరు, జనవరి 16 : సంక్రాంతిని పురస్కరించుకుని చెన్నూరులో గొబ్బెమ్మ గౌరమ్మల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. చెన్నూరు పురవీధుల్లో గొబ్బెమ్మలను ఇంటింటా తిప్పిన మహిళలు మంగళవారం కనుమ పండుగ నాడు స్థానిక టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆటోబాబు ఆధ్వర్యంలో చెన్నూరు పురవీధుల్లో ఊరేగించి స్థానిక పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

సీకేదిన్నెలో...

చింతకొమ్మదిన్నెలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహిళలు మంగళవాయిద్యాలు, కోలాటం, గౌరమ్మ పాటలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

అనంతరం గౌరమ్మను గంగలో కలిపారు. చింతకొమ్మదిన్నె, నాగిరెడ్డిపల్లె, తదితర గ్రామాల్లో గ్రామాల్లో కూడా అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు.



కోలాటం ఆడుతున్న యువతులు



చింతకొమ్మదిన్నె: అమ్మవారిని ఊరేగిస్తున్న మహిళలు



పెండ్లిమర్రిలో స్వామివారి కళ్యాణోత్సవం

కులమతాలకు అతీతం.. సంక్రాంతి పండుగ

● కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి



సాయిబాబా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కడప టీడీపీ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

కడప (నాగరాజుపేట),జనవరి 16:కులమతాలకతీతంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అని కడప నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి పేర్కొన్నారు. జేకే యూత్ వె ల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు, ముస్లిం మైనార్టీ నాయకులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా మంగళవారం కడప నగరంలోని ద్వారకానగర్‌లో కడప టీడీపీ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెతో కలిసి సా యిబాబా క్యాలెండరును ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి మెలిసి పండుగలు ఆనందంగా జరుపుకోవాలన్నారు.

విజయదుర్గాలయంలో ఘనంగా రాహుకాల పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న మహిళలు (ఇన్‌సెట్) విజయదుర్గాదేవి అమ్మవారు

కడప (కల్చరల్), జనవరి 16 : కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు జిల్లా నలుమూలల నుంచి హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి భక్తిభావాన్ని చాటుకున్నారు. ఇలా చేయడం వల్ల వివాహ ప్రాప్తి.. ఉద్యోగ ప్రాప్తి లభించగలదని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

బేడ బుడ్గజంగం వారికి ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి

● రాష్ట్ర ఎస్సీ కమిషన్‌కు బుడ్గజంగం వినతి



ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న బుడ్గ జంగం నేతలు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 16: బేడ బుడ్గ జంగం కులస్తులకు ఎస్సీ సర్టిఫికెట్లు మం జూరు చేయాలని ఆ సంఘం నాయకులు ప స్తం అంజి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ మంత్రితో మాట్లాడి ఎస్సీ సర్టిఫికెట్ వచ్చేలా చూడాలన్నారు.

నిధుల కేటాయించండి: ప్రభుత్వ వసతగృహాల్లో చదివే విద్యార్థులకు పెండింగులో ఉన్న మెస్ చార్జీలు విడుదల చేయాలని పీఎస్ యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

చంద్రబాబు సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, జనవరి 16: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు 19న కమలాపురంలో బహిరంగసభకు రానున్న సందర్భంగా 'రా.. కదలిరా' అన్న రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యకర్తా చెన్నూరు మండలానికి తరలి వచ్చి చంద్రబాబు సభ విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన చెన్నూరులో పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కడప జిల్లాలో చంద్రబాబు బహిరంగ సభ అందులోనూ కమలాపురంలో నిర్వహించడం తనకెంతో సంతోషంగా ఉందని ఈ సభను విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమానులు ప్రజలు విరివిగా తరలిరావాలని కోరారు. అలాగే మండల పార్టీ కేడరంతా సభ విజయవంతం అయ్యేందుకు తప్పక కృషి చేయాలని మండల కన్వీనరు దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనబరాచలన్నారు. అలాగే చెన్నూరు మండలంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సమస్యలు కూడా ఈసభలో చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు. కావున సభ విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ ఈ రెండురోజులపాటు సైనికుల్లా పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ నేతలు విజయభాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, హైదర్‌బాషా, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, అల్లాడు రాజశేఖర్‌రెడ్డి, మన్నూరు అక్బర్, ఆటోబాబు, కుందేటి క్రిష్టయ్య, సుదర్శన్‌రెడ్డి, మల్లెసుబ్బయ్య పాల్గొన్నారు.

కన్నుల పండువగా అంజన్న గ్రామోత్సవం



చక్రాయపేట, జనవరి 16: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రముఖ గండి క్షేత్రంలో వీరాంజనేయస్వామి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి మాట్లాడుతూ పుష్పాలంకరణ గావించిన రథంపై స్వామివారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి ఊరేగించినట్లు తెలిపారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని తరించారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు రాజాస్వామి, ముఖ్య అర్చకులు గోపాలస్వామి, వేదపండితులు రామమోహన శర్మ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడే సందడి

కడప (కల్చరల్), జనవరి 16 : కడప శిల్పారామం సందడిగా మారింది. సాంస్కృతిక కళావేదికపై 3 - 9 సంవత్సరాల వయసు గల 26 మంది పిల్లలకు సాంప్రదాయ వస్త్రధారణ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి న్యాయనిర్ణేతలు ఆలీ, సుమలతలు బహుమతులు అందించారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడండి

● సంక్రాంతి ఉత్సవాల్లో 49వ డివిజన్ కార్పొరేటర్ ఉమాదేవి



మాట్లాడుతున్న టీడీపీ కార్పొరేటర్ ఉమాదేవి

కడప(కల్చరల్), జనవరి 16: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడి టీడీపీని గెలిపించాలని 49వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఉమాదేవి ప్రజలకు పిలుపు నిచ్చారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళ వారం స్థానిక ఆలం ఖాన్‌పల్లెలో సంక్రాంతి యువజనోత్సవాల సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా గ్రామంలో వివిధ క్రీడల్లో పాల్గొన్న విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు ఐదేళ్లుగా వైసీపీ అరాచక పాలన సాగుతోందని, మరోమారు వైసీపీ పాలన కొనసాగితే ప్రజల బతుకులు ఆగమ్యగోచరంగా మారుతాయన్నారు.

కావున ప్రజలు చైతన్యవంతులై టీడీపీని గెలిపించేందుకు కంకణబద్ధులు కావాలన్నారు. టీడీపీ సీనియర్ నేత లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గత 46 ఏళ్లుగా యువజనోత్సవాలు కొనసాగుతున్నాయన్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. గ్రామ యువ నాయకులు మునికుమార్‌రెడ్డి, ఆర్.జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు కె.బ్రహ్మయ్య, బాబాఫకృద్దీన్, ఈశ్వరయ్యతో పాటు ప్రసాద్, వీరప్రతాప్, జానకిరామ్‌లు ఉన్నారు. గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను రక్షిద్దాం



కవులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 16 : భావితరాల కోసం నానాటికీ కనుమరుగవుతున్న సంస్కృతీ సాంప్రదాయాలు పరిరక్షిద్దాం అని ఇంటాక్ జిల్లా కన్వీనర్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. మంగళవారం ఇంటాక్ లయన్స్ క్లబ్ రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కడప నగరం గ్రాండ్ ఇన్ సమావేశ మందిరంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి అన్నం పెట్టే రైతు క్షేమంగా ఉన్నప్పుడే సమాజంలో ఎలాంటి అలజడులు ఉండవన్నారు. ఇంటాక్ ఆధ్వర్యంలో సంస్కృతీ సాంప్రదాయాల రక్షణకు ఇలాంటి సందర్భాలను వినియోగించుకుంటున్నామన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి, రాయలసీమ సంస్థ పాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, ప్రొఫెసరు మూలమల్లిఖార్జునరెడ్డి, అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, ఎన్ఆర్ఐ ఈశ్వర్‌కుమార్‌రెడ్డి, రాయలసీమ సంస్థ అధ్యక్షులు కొండూరు జనార్ధన్‌రాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వెల్లాల వెంకటేశ్వరచారి, మధుబాబు, పద్యాలాపానలతో ఉర్రూతలూగించారు.

పార్వేటలో సాయినాథ్‌శర్మ

చెన్నూరు, జనవరి 16 : మండలంలోని కొండపేటలో కనుమ పండుగ సందర్భంగా పెన్నాతీరంలో నిర్వహించిన పార్వేట ఉత్సవంలో పుణ్యభూమి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సాయినాధ శర్మ హాజరై ఉమామహేశ్వరులను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు స్వాగతం పలికారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా కల్యాణం

పెండ్లిమర్రి, జనవరి 16: మండలంలోని వెల్లటూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కళ్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను పెద్దిరెడ్డి రామమోహన్‌రెడ్డి దంపతులు సమర్పించారు. వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

రాజకీయ భవిష్యత్తు కోసం సర్వమత ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 16 : కడప నగరం ద్వారకనగర్ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా పుర ప్రముఖులకు ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ఈ విందు ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. శ్రీనివాసరెడ్డికి అలాగే కడప టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డికి వారు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి రాజకీయ భవిష్యత్తు కోసం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంపీ సురేష్, ఏపీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ మల్లెం విజయభాస్కర్, బిషప్‌లు కె.శ్యామ్యుల్‌బాబు, డానియేల్, క్రిస్టదాస్, విజయశేఖర్, డేవిడ్‌రాజ్, సుధీర్, వర ప్రసాద్, కిరణ్, జాన్సన్, సత్యమయ్య, అమర్, ఐజాక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమ్మేళనానికి ప్రొఫెసరు వినోదినికి ఆహ్వానం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 16 : విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో ఈ నెల 17న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై నిర్వహించే రాష్ట్ర సమ్మేళనానికి ప్రతినిధిగా హాజరుకావాలని వైవీయూ తెలుగు శాఖ ప్రొఫెసరు ఎంఎం వినోదినికి ఆహ్వానం లభించింది. విజయవాడలోని స్వరాజ్‌మైదాన్‌లో ఈ నెల 19న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి సామాజిక న్యాయం విగ్రహంగా నామకరణం చేయనున్నారు. మహనీయుని జ్ఞాపకార్థం పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. 17న జరిగే రాష్ట్రస్థాయి సమ్మేళనానికి పలువురు ఐఏఎస్ అధికారులు, రాష్ట్ర ఉన్నతాధికారులు హాజరయ్యే ఈ సదస్సులో ప్రొఫెసరు వినోదిని ప్రసంగించారు. 22ఏళ్ల బోధనానుభవం, పేదరిక నిర్మూలన, మహిళలు, దళిత సాధికారతలో ఆరు సంవత్సరాలు ప్రాజెక్టు కోఆర్డినేటనే సామాజిక కార్యకర్తగా పనిచేశారు. వందకు పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించారు. 8 పుస్తకాల రచయితగా ఉన్నారు. ఆమె 2022 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మకమైన గిడుగు రామమూర్తి తెలుగుభాషా పురస్కారం అందుకున్నారు. సదస్సుకు ఆహ్వానం అందుకున్న ప్రొఫెసరు వినోదినిని వైవీయూ అధికారులు, పరిశోధకులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఒంటెద్దు బండలాగుడు పోటీలు



ఒంటెద్దు బండలాగుడు పోటీల్లో విజేతలకు బహుమతి అందిస్తున్న పాకా సురేష్

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 16:కడప నగరం 47వ డివిజన్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పాకా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా ఒం టెద్దు బండలాగుడు పందాలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు మొదటి మూడు స్థానాలకు బహుమతులు అందించారు. మొదటి బ హుమతి అలంఖాన్‌పల్లెశివ, రెండో బ హుమతి షేక్‌రెడ్డి బాషా, మూడో బహుమతి కాజీపల్లెహనుమంతు కైవసం చేసుకున్నారు. కనుమపండుగను పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి జ్ఞాన సాయి, రెండోబహుమతి పద్మప్రియ, మూడో బహుమతి ఉమామహేశ్వరి సొంతం చేసుకున్నారు. రామలింగారెడ్డి, వైవీ రమణారెడ్డి, రెడ్డివరకుమార్, రాజ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి

జమ్మలమడుగు, జనవరి 16: ఆర్టీసీ డ్రైవర్లు విధులలో అప్రమత్తంగా ఉండాలని డిపో మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డిపో మేనేజర్ మాట్లాడారు. ప్రమాదాల నివారణకు సూచనలు తెలియజేశారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు, గ్యారేజీ సిబ్బంది, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సహాయం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 16 : ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గాలి శ్రీలీన కు తొగటవీరక్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో హాస్టల్ ఫీజుల కోసం రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ ఆ విద్యార్థికి గత ఏడాది రూ.30వేలు ఆర్థిక సహాయం అందించామన్నారు. ప్రతిభావంతులైన తొగటవీరక్షత్రియ విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని, వారికి చేయూతనిస్తామని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థిని గంజికుంట లలితకు కళాశాల ఫీజు రూ.25వేలు చెల్లించినట్లు చెప్పారు.సంఘంఉపాధ్యక్షుడు ఉమ్మడిశెట్టి చౌడయ్య, మోతుకూరు సుబ్బయ్య, రామయ్య, తులసీశ్వరయ్య, గాలి లక్ష్మీనారాయణ, సుబ్బయ్య, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు మేలుకో బీసీ చర్చావేదిక

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 16 : బీసీలలో రాజకీయ చైతన్యం కల్పించడానికి బుధవారం సాయంత్రం పద్మశాలీయ కల్యాణ మండపంలో మేలుకో బీసీ ప్రజాతంత్ర చర్చా వేదికను నిర్వహిస్తున్నట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెన్నా సరళాదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో మేలుకో బీసీ చర్చా వేదిక కరప్రాతాలను ఆవిష్కరించారు. బుధవారం జరిగే మేలుకో బీసీ చర్చా వేదికకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీ నరసయ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు పాల్గొంటారని చెప్పారు. బీసీ కులాల నాయకులు, ప్రతినిధులు పాల్గొని సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో పాణ్యం సుబ్బరాయుడు, సందు శివనారాయణ, రామకృష్ణ, కృష్ణయ్య యాదవ్, రామదాసు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 80 కుటుంబాలు టీడీపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి

మైలవరం, జనవరి 16 : మండల పరిధిలోని చిన్నవెంతుర్ల గ్రామంలో వైసీపీ నుంచి 80 కుటుంబాలు వారు టీడీపీలో చేరారు. మంగళవారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి పలు కుటుంబాల వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ కోట వెంకట శివరామిరెడ్డి, మొలక వెంకటేశ్వర్లు (సర్పంచ్)వెంకటేశ్వరరెడ్డి, వాసుదేవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బండల మహమ్మద్, మస్తాన్, చిట్టిబోయిన అన్నమయ్య, బూరుగుల భాస్కర్, నర్సింగాళ్లసుధాకర్, సుందర్, చేరెడ్డి రామనాద్‌రెడ్డి, మొలకశివ, తదితర కుటుంబాల వారికి పార్టీ కండువా కప్పి భూపేశ్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణ రెడ్డి, శివనాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల నాయకులు కాంట్రాక్టర్ గోవింద్, కొండయ్య, పాపిరెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చల్లా రాజగోపాల్

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 16 : సీమాంధ్ర బీసీ సంక్షేమ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలతో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ఆయన మిత్రులు రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణాలయం కార్యదర్శి గండి ఆంజనేయులు యాదవ్, సీతంపల్లె రమణ, దస్తగిరి బాషా, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసయాదవ్, ప్రసాద్, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్వేట ఉత్సవాలు







మైదుకూరులో ఊరేగుతున్న శ్రీ దేవి భూదేవీలతో మాధవుడు, ఖాజీపేటలో కోలాటం వేస్తున్న దృశ్యం, ఎర్రగుంట్లలో పార్వేటకు తరలివచ్చిన జనం

మైలవరం, జనవరి 16: మండల పరిధిలోని రేగడిపల్లి, బెస్తవేముల, దొమ్మరనంద్యాల తదతర గ్రామాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లోని సీతారాముల స్వాముల వారిని ఇంటింటికి ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో పాటలు పాడుకుంటూ ఆనందోత్సాహాల నడుమ ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు.పలు గ్రామాల్లో పార్వేట కార్యక్రమాలు నిర్వహించారు.

అట్లూరు..: అట్లూరు మండలంలో ఊరూరా గొబ్బిళ్లో, గొబ్బిళ్ల అంటూ గొబ్బెమ్మను మేళతాళాలతో ఊరేగింపుగా గ్రామాల్లోని మహిళలు పాటలతో ఇంటింటికీ తిరుగుతూ పాటలతో కవ్వింపజేశారు. గ్రామ సమీపంలోని జలపాతాలలో గొబ్బెమ్మను నిమజ్జనం చేస్తారు. సంక్రాంతి, కనుమ పండుగలను గ్రామాల్లో బంధువులతో కన్నుల పండువగా జరుపుకున్నారు.

మైదుకూరు..: పట్టణంలోని వివిధ ఆలయాలల్లో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. శ్రీలక్ష్మి మాదవరాయ స్వామి, కోదండ రామాలయం, వెంకటేశ్వరుడు, ఇలా పలు ఆలయాల్లో ఆయా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సంక్రాంతి పూజలు నిర్వహించారు. కనుమ పండుగ సందర్భంగా మంగళవారం సాయంత్రం శ్రీదేవి,భూదేవీలతో మాధవరాయుడు ప్రత్యేక పూల అలంకరణలో పార్వేటకు బయలుదేరారు. కాగా పార్వేట సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, చెక్కభజన. విచిత్రవేషాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పట్టణ శివారు ప్రాంతాలైన 18 గ్రామాల్లో పారువేట ముగించుకొని లక్ష్మి మాదవరాయుడి తరువాత మైదుకూరుకు చేరుకోనున్నారు.

ఘనంగా కుందేళ్ళ పార్వేట..: మండలంలోని జాండ్లవరంలో ఘనంగా కుందేళ్ళ పార్వేట ఉత్సవం నిర్వహించారు. గ్రామంలోని శ్రీరామునికి మూడురోజుల పాటు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్థానిక చెరువులో కుందేళ్ళను విడిచి పెట్టి పార్వేట ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకురాలు తారకరెడ్డి, నాయకులు మాచుపల్లి రామచంద్ర నాయుడు, భీమయ్య, కొండారెడ్డి, రవి చంద్ర భక్తులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం పార్వేట ఉత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి స్వామివారిని ఆలయ అధికారులు, సిబ్బంది పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. అలాగే మండలంలోని గొరిగెనూరు, పెద్దదండ్లూరు, తదితర గ్రామాల్లో శ్రీరాముడు, ఆంజనేయస్వాములను సాంప్రదాయ బద్ధంగా పార్వేట ఉత్సవం నిర్వహించి పూజలు చేసి మొక్కుకున్నారు.

కాశినాయన..: మండలంలో 3 రోజులుగా సంక్రాంతి పండుగను ప్రజలు సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. గ్రామాల్లో యువతి, యువకులు భోగిమంటలువేసి పండుగకు స్వాగతం పలికారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం దూరప్రాంతాల్లో ఉన్నవారు పండుగకు పల్లెలకు రావడంతో గ్రామాల్లో సందడివాతావరణం ఏర్పడింది. పిట్టిగుంటలో ముగ్గుల పోటీలు, గొంటువారిపల్లెలో క్రికెట్ పోటీలు,కోలాటం,భజనలు, పాటకచ్చేరి లాంటి కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

ఖాజీపేట..: సంక్రాంతి సంబరాలు మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో బండలాగుడు పోటీలు, కోలాటం, పాటల కచ్చేరి, డీజే సాంగ్స్ డ్యాన్స్ ప్రోగ్రాంలు నిర్వహించి బంధువులు, స్నేహితులతో సంతోషంగా జరుపుకున్నారు. మంగళవారం కనుమ పండుగను పురస్కరించుకుని బంధువులతో కలిసి విందు ఏర్పాటు చేసుకున్నారు. సాయంత్రం సీతారాములను పార్వేటకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భారీగా కోలాటాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఎర్రగుంట్ల..: సంక్రాంతి సందర్భంగా సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజల నిర్వహించారు. ఎర్రగుంట్ల నడివూరులోని రామాలయంలో కనుమ సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆంజనేయ స్వామి పార్వేట కార్యక్రమం మార్కెట్‌యార్డు వరకు నిర్వహించారు. మార్కెట్‌యార్డులోకి వేలాదిగా వచ్చిన భక్తులు ఆంజనేయస్వామికి కాయకార్పూలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా కోలాటం, చెక్కభజనలతో సందడి నెలకొంది. భజన బృందాల ప్రత్యేక పాటలు ఆలరించాయి. రామాలయ కమిటీ భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు.

ప్రొద్దుటూరు టౌన్..: రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం గంగా కాశీఅన్నపూర్ణేశ్వరదేవి సమేత హనుమత్‌లింగేశ్వరస్వామి, గంగా రాజరాజేశ్వరిదేవి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి మంగళవారం సాయంత్రం పెన్నానది ఒడ్డున పార్వేట ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం రామేశ్వరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పార్వేట ఉత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కాశినాయనలో ముగ్గులు వేస్తున్న మహిళలు



ప్రొద్దుటూరులో ముక్తిరామలింగేశ్వరస్వామి పార్వేట ఉత్సవం..



ప్రొద్దుటూరు బొల్లవరం ప్రసన్న వెంకటేశ్వరస్వామి పార్వేట

ప్రొద్దుటూరు టౌన్..: బొల్లవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్వేట ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్వామి, అమ్మవార్లను పట్టు వస్త్రాలు, ఆభరణాలతో, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక వాహనంలో ఆశీనులను చేసి ఆలయం వెనుక ఉన్న మైదానంలో పార్వేట ఉత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొండాపురం..: మండలంలోని కె.బొమ్మేపల్లె ఆర్ అండ్ ఆర్ కాలనీలో కనుమ రోజు మంగళవారం శ్రీక్రిష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను తాళ్ళప్రొద్దుటూరు పీహెచ్‌సీ డాక్టర్ రెహనా,హెడ్మాష్టర్ సాంబశివారెడ్డి అందజేశారు. మొదటి ప్రైజ్ ఫ్రిజ్ భవ్యశ్రీ ,రెండో ప్రైజ్ హాస్‌కిట్ తేజస్విని ,మూడు ప్రైజ్ టీపాయి అరుణ గెలుచుకున్నారు.పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సొలేషన్ బహుమతులను అందజేసినట్లు నిర్వహకులు ప్రతాప్‌యాదవ్ తెలిపారు.



మైలవరం రేగడిపల్లిలో సీతారాముల వారిని ఊరేగిస్తున్న భక్తులు



కొండాపురంలో విజేతకు ఫ్రిజ్‌ను అందజేస్తున్న దృశ్యం

పండుగ రోజూ అంగన్వాడీల సమ్మె



బద్వేలులో నెత్తినోరు బాదుకుంటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



పోరుమామిళ్లలో అర్ధనారీశ్వర రూపంలో అంగన్వాడీల నిరసన

కొండాపురం, జనవరి 16 : మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు 35వ రోజు మంగళవారం కొండాపురంలో గాలిపటాలపై సమస్యలు రాసి, గాలిపటాలు ఎగురవేసి తమ నిరసన వ్యక్తం చేశారు.న్యాయపరమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని, జీతాలు పెంచి వెంటనే తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటీయూ, ఏఐటీయూసీ నేతలు తారాదేవి, పద్మ,వరలక్ష్మి,జ్యోతి,విజయలక్ష్మి ,పద్మావతి, శిరీష, శివపార్వతిపాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: తమ న్యాయమైన డిమాండ్లు తీర్చాలని కోరుతూ మకర సంక్రాంతి సోమవారం అంగన్వాడీలు సమ్మె చేపట్టి 35 రోజులు కావడంతో 35వ సంఖ్య ఆకారంలో సమ్మెలో కూర్చుని నిరసన తెలిపారు. అలాగే మంగళవారం నెత్తి, నోరు బాదుకుంటూ వినూత్న నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శిశ్రీనివాసులు,పట్టణ కోశనీనరు కొండయ్య, అంగన్వాడీ నాయకులు పాల్గొన్నారు,

పోరుమామిళ్ల..: తమ న్యాయమైన హామీలు పరిష్కరించాలని కోరుతూ పోరుమామిళ్లలో తహసీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె మంగళవారానికి 35వ రోజుకు చేరింది. ఈ సమ్మెలో భాగంగా అర్ధనారీశ్వర రూపంలో శివపార్వతుల అవతారమెత్తారు. సీఐటీయూనేతలు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. మంగళవారం సమ్మెలో భాగంగా నిరసన తెలియజేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మద్దతు పలికారు. అయితే మధ్యాహ్నం ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు జగన్‌మోహన్‌రెడ్డి మాస్కు ధరించి నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ అసోసియేషన్ నాయకులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ..: సంకాంత్రి రోజూ అంగన్‌వాడీల నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సోమ,మంగళవారం పండగరోజులో అంగన్ వాడీలు తహసీల్దారు కార్యాలయంవద్ద నిరసన కార్యాక్రమాలు చేపట్టారు. సంకాంత్రి పండుగరోజు ముగ్గుల వేశారు. కనుమ నాడు మోకాళ్ళ మీద నిలబడి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, యూనియన్ నేతలు పాల్గొన్నారు

మైదుకూరు..: తమ బతుకులు సీఎం గాలిపటాలుగా గాలికి వదిలారంటూ అంగన్వాడీ కార్యకర్తలు మైదుకూరులో గాలిపటాలు చేతపట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 36వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మైదుకూరులో ఎంపీడీవో కార్యాలయం వద్ద అంగన్వాడీల కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో ముగ్గులు వేస్తున్న అంగన్వాడీలు



మైదుకూరులో గాలిపటాలు చేతపట్టిన అంగన్వాడీలు

సగరులకు టికెట్లు కేటాయించాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 16 : సగరులకు రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు మురళి పేర్కొన్నారు. మంగళవారం సగర సంఘం జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర జేఏసీ గౌరవాధ్యక్షుడు పంజగాళ్ల మురళి, నరసింహ, కేశవ, లక్ష్మీనారాయణ, హరి, మల్లికార్జున, కొండయ్య పాల్గొన్నారు.

మైలవరం, తలమంచిపట్నం ఎస్ఐలుగా హనుమంతు, రెడ్డిసురేష్

మైలవరం, జనవరి 16: మైలవరం, తలమంచిపట్నం ఎస్ఐలుగా రెడ్డిసురేష్, హనుమంతు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మైలవరం ఎస్ఐ బీవీ కృష్ణయ్య కడప వన్‌టౌన్‌కు బదిలీఅయ్యారు, కాగా ప్రొద్దుటూరు టూటౌన్‌లో విధులు నిర్వహిస్తున్న రెడ్డి సురేష్ మైలవరానికి, తలమంచిపట్నం ఎస్ఐ గోపినాథ్‌రెడ్డి కడప వీఆర్‌కు వెళ్లగా తొండూరు ఎస్ఐగా ఉన్న హనుమంతు ఇక్కడకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

బి.కోడూరు ఎస్ఐగా జయరాములు

బి.కోడూరు, జనవరి 16 : బి.కోడూరు సబ్ ఇన్‌స్పెక్టరుగా వై.యూ జయరాములు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కత్తి వెంకటరమణ కడపకు బదిలీ కావడంతో కడప టూటౌన్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన సదస్సు

బ్రహ్మంగారిమఠం, జనవరి 16 : ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన కేంద్ర పథకాలపై వికసిత్ భారత్ సంకల్పయాత్రను మంగళవారం పలుగురాళ్లపల్లె ముదుమాల పంచాయతీలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పథకాలపై అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ప్రతినిధులు డాక్టర్ చెన్నకేశవ, ఏవో మల్లికార్జునరావు, వెలుగు ఏపీయం ప్రకాశరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఈవో వెంకటేశ్వర్లు, వీఆర్వో సుధాకర్, ఏవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ సంజీవరెడ్డి, బ్యాంకర్లు, స్కూలు టీచర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమాన్ని గాలికొదిలిన రాష్ట్ర ప్రభుత్వం

బద్వేలు, జనవరి 16 : ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ ఆరోపించారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద గాలిపటాలు ఎగురేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని వినూత్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన,కార్యదర్శులు దేవానందం, సుధాకర్, గోపవరం మండల అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్టఫర్, చెన్నయ్య, చక్రపాణి, మస్తాన్‌వలి పాల్గొన్నారు.